క్లుప్తంగా

వైభవంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



దుద్దుకూరు షిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో కొలువైన షిర్డీసాయిబాబా మందిర 16వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 23న ఈ వేడుకలను ప్రారంభించారు. రోజు బాబాకు అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. షిర్డీ పద్ధతిలో భక్త జన సందోహంతో రోజుకు నాలుగు హారతులు ఇస్తున్నారు.రోజూ మూల మంత్రాలతో హోమాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మందిర ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరుగుతుందని మందిర కమిటీ సభ్యులు తెలిపారు.

నల్లజర్లలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నల్లజర్లలో ప్రతిష్ఠించిన 12 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం

నల్లజర్ల: స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. వేద పండితులు నందుల ఆంజనేయశర్మ, సామవేదం నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తిన సత్యనారాయణ, సభ్యులు తెలిపారు.

నేడు కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి నామినేషన్

దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థిగా ఎస్. మార్టిన్ లూథర్ గురువారం ఉదయం 11.15 గంటలకు నామినేషన్ వేస్తారు. గురువారం ఉదయం 10 గంటలకు దేవరపల్లిలోని తమ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా గోపాలపురం వెళ్లి 11.15 గంటలకు రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తానని మార్టిన్ లూథర్ బుధవారం దేవరపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పార్టీ శ్రేణులంతా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లిలోని 33 కేవీ విద్యుత్తు కేంద్రంలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ అనంతపల్లి, కృష్ణమ్మగూడెం, తూర్పు, పడమర చోడవరం గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్లకు త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా తెల్లవారుజాము 3 నంచి ఉదయం 6 గంటల వరకూ, తిరిగి ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఉంటుందని తెలిపారు.

పురందేశ్వరి ఎన్నికల ప్రచారం

గోపాలపురం: బీజేపీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం గోపాలపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుతో కలసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు.

వాహనం బోల్తా: పలువురికి గాయాలు



బోల్తా పడిన టాటా ఏస్ వాహనం

నల్లజర్ల: గణపవరం మండలం అడవికొలను గ్రామం నుంచి దేవరపల్లి మండలం, గౌరీపట్నం మేరీమాత దేవాలయానికి భక్తులతో వెళుతున్న టాటా ఏస్ వాహనం బుధవారం మండలంలోని వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ వాహనంలో మండా ఏసు, ప్రగడ సత్యనారాయణ కుటుంబాలకు చెందిన మొత్తం 21 మంది ప్రయాణిస్తున్నారు. వారిలో పలువురికి గాయాలయ్యాయి. ఒకరికి చేయి విరిగింది. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

18 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

నల్లజర్ల: పోతవరం గ్రామంలో ఇద్దరు వ్యక్తుల నుంచి అక్రమంగా దాచిన 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ దేవరపల్లి సీఐ కేవీ స్వామి బుధవారం తెలిపారు. వారిద్దరినీ అరెస్ట్ చేసినట్టు చెప్పారు.ఈ దాడిలో ఎస్ఐ పి.సుదీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపు తథ్యం..మెజార్టీయే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల సూచన
- సైనికుల్లా పని చేయాలని డాక్టర్ శ్రీనివాస్, వెంకట్రావు పిలుపు
- కొవ్వూరులో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



కొవ్వూరు సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, మెజార్టీ పెంపుపైనే పార్టీ శ్రేణులంతా దృష్టి సారించాలని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం సాయంత్రం స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. వారిద్దరూ మాట్లాడుతూ కూటమి పార్టీల కుట్రలను, దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రతి గడపకూ తీసుకెళ్లాలన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉన్న పోల్ సర్వే సంస్థలన్నీ వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని స్పష్టం చేస్తున్నాయన్నారు. ప్రతి గ్రామంలోను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 26న ప్రకటించే మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గురువారం నుంచి ప్రచార రథంపై నుంచి గ్రామాల్లో పర్యటించనున్నట్టు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రకటించారు. అంతకు ముందు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పార్టీ తాళ్లపూడి మండల శాఖ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి తది తరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఐదు నామినేషన్ల దాఖలు

కొవ్వూరు: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారి తరుపున గెడ్డం సాయిబాబా బుధవారం రెండో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున బొంతా శ్యాం రవిప్రకాష్ రెండో సెట్టు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు మూడో సెట్టు, టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున మద్దుల వీర వెంకట సత్యనారాయణ మూడో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా తాతపూడి సుజయ్ ప్రవీణ్ కుమార్ రెండో సెట్ నామినేషన్‌ను సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు అందజేశారు.

నిడదవోలులో మరో ఆరు..

నిడదవోలు: నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. బుధవారం వైఎస్సార్ సీపీ తరపున గెడ్డం శ్రీనివాస్‌నాయుడు, జనసేన పార్టీ తరపున కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్‌లు చెరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున పెద్దిరెడ్డి సుబ్బారావు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున పులమల వీరభద్రం, ఇండిపెండెంట్లుగా అరిగెల సత్య వరప్రసాద్, కృష్ణతేజ నామినేషన్లు వేశారు.వారంతా నిడదవోలు రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్. వెంకటరమణ నాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన అధికారులు

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను బుధవారం రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పరిశీలించారు. ఇక్కడి స్ట్రాంగ్ రూమ్‌ల్లోని ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లను భద్రంగా చూసుకోవాలని తహసీల్దార్ డి. వనజాక్షి పోలీసు అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈమె వెంట దేవరపల్లి సీఐ కె .బాలసురేష్, ఎస్సై కర్రి సతీష్‌కుమార్, డీటీ సాకే కృష్ణ ఉన్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తేనే సువర్ణ పాలన



కొవ్వూరు 23వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- పట్టణంలోని 23,16వ వార్డుల్లో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తేనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సువర్ణ సంక్షేమ పాలన మళ్లీ సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం ఉదయం, సాయంత్రం పట్టణంలోని 23,16 వార్డుల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. గడప గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వెంకట్రావు కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల పేదలకు మేలు చేకూరుతుందన్నా రు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, నాయకులు కొయ్యల భాస్కరరావు, వరిగేటి సుధాకర్, కంఠమణి రమేష్ బాబు, పార్టీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, చిట్టూరి అన్నవరం, బావన రాజేష్, తోట రామకృష్ణ, యాళ్ల నరసింహారావు, గంగాధర నాగేశ్వరరావు, పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, పతివాడ రామారావు, చొప్పా అప్పలనాయుడు, సూర్ల నగేష్, నామా ప్రకాశం, కొణతం శేషగిరి, వీర్ల శ్రీహరిపద్మ, మాసా ఆనంద్, ముంగమూరి నాగమణి, బోడపాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వనిత మూడో సెట్ నామినేషన్ దాఖలు



గోపాలపురంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 19న రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసిన ఆమె మూడో సెట్ నామినేషన్ పత్రాలను బుధవారం ఉదయం గోపాలపురంలో రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీశివజ్యోతికి అందజేశారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ ఖాదర్ వల్లీ, గోపాలపురం, దేవరపల్లి ఎంపీపీలు ఉండవల్లి సత్యనారాయణ, కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలగా శ్రీరామూర్తి, సొసైటీ అధ్యక్షుడు కూసం రామ్మోహన్‌రెడ్డి, జొన్నకూటి విజయ్‌మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోపాలపురం అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ముక్కవల్లి వెంకటరమణ, రాపాక హరీష్‌కుమార్ బుధవారం తమ నామినేషన్ పత్రాలను దాఖలు రిటర్నింగ్ అధికారి కె. లక్ష్మీశివజ్యోతికి అందజేశారు.

శత్రువులంతా ఏకమైనా విజేత జగనే

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- ఏడు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



భీమోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత

గోపాలపురం: కూటమి పేరుతో ఎన్నికల సమరానికి శత్రువులంతా ఏకమైనప్పటికీ ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని భీమోలు, గంగోలు, రాంపాలెం, హుకుంపేట, యర్రవరం, సగ్గొండ, గోపవరం గ్రామాల్లో బుధవారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆమె ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు అమలు చేయరన్నారు. రాష్ట్రం మరో పదేళ్లు వెనుకబడుతుందన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించి మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపు నిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రకటిస్తున్న అసత్య పథకాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఇక్కడి నుంచి తనను, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రచారంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ నాయకులు పోతిరెడ్డి నాగరాజు, కవిత, వెలగా శ్రీరామమూర్తి, ఎస్కే వల్లీ, సర్పంచులు అన్నెపు వెంకటలక్ష్మి, యండపల్లి శేఖర్‌బాబు, సాలి వేణు, బండారు జగన్‌మోహన్‌రావు, వింటి రామకృష్ణ, కాకులపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా



ఉండ్రాజవరం మండలం చివటంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- చివటం, చిలకపాడు గ్రామాల్లో ప్రచారం

ఉండ్రాజవరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున బరిలో ఉన్న తనను గెలిపిస్తే నిడదవోలు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు హామీ ఇచ్చారు. మండలంలోని చివటం, చిలకపాడు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, వాటిని పారదర్శకంగా లబ్ధిదారులకు అందించిన విధానాన్ని ఆయన ప్రజలకు వివరించారు. మహిళలు, వృద్ధులను శ్రీనివాస్‌నాయుడు ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున అధిక టిక్కెట్లు బీసీ సామాజిక వర్గానికి కేటాయించి వారికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీసీలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ప్రచారంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొఠారు సత్యనారాయణ, సర్పంచ్ తిరుమళ్ల వెంకట సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమళ్ల నాగపార్వతి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గంటిన లక్ష్మీగణపతి, కోలా గణపతి, రాజమండ్రి శివ, గుత్తికొండ శ్రీను, పి.సత్యనారాయణ, టి.శ్రీను, మాండ్రు శివ, వైస్ ప్రెసిడెంట్ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'తలారి' ఎన్నికల ప్రచారం

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తారు. ఉదయం 8 గంటలకు తాడిపూడిలో రోడ్ షోలో పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం 10 గంటల నుంచి పోచవరం, రాగోలపల్లి, తుపాలకుల గూడెం గ్రామాల్లో రోడ్ షో జరుగుతుందన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నల్లజర్ల: స్థానిక మసీదు వీధిలో బుధవారం రాత్రి తలపెట్టిన బాల్య వివాహాన్ని జిల్లా చైల్డ్ రైట్స్ కమిషన్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ వీధిలోని ఆనెం రాంబాబు, బేబీలత దంపతుల మైనర్ కుమార్తెకు బుధవారం రాత్రి వివాహం తలపెట్టారు. ఆమెకు వివాహ వయస్సు అయిన 18 ఏళ్లు నిండలేదంటూ అజ్ఞాత వ్యక్తులు చైల్డ్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆ సంస్థ నుంచి క్రాంతికుమార్ బుధవారం ఉదయం నల్లజర్ల వచ్చారు. స్థానిక అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, గ్రామ మహిళా సంరక్షణాధికారి కె.సౌజన్యలతో కలసి ఆయన ఆ బాలిక తల్లిదండ్రులను కలుసుకుని మాట్లాడారు. వివాహ వయస్సు వచ్చేవరకూ తమ కుమార్తెకు వివాహం చేయబోమని తల్లిదండ్రుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు. దీంతో ఆ బాలిక వివాహం ఆగిపోయింది. శివకుమారి, ఆశవర్కర్ వైవీరత్నం వారితో ఉన్నారు.

సంక్షేమ పాలనకు జగన్‌ను గెలిపిద్దాం



అన్నదేవరపేటలో నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- అన్నదేవరపేటలో ప్రచారం

తాళ్లపూడి: సంక్షేమ పాలన అందాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామస్తులను కలసి ఎన్నికల్లో సహకరించాలని కోరారు. గ్రామంలోని బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలోని బీసీ కాలనీలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. మే నెలలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయలు, నాయకులు కందికొండ సత్యనారాయణ, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, ఎలిపే రాజు, రసూల్ తదితరుల పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారం



నిడదవోలు 6వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ ప్రచారం



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య ప్రచారం

నిడదవోలు: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మహిళా పక్షపాతి అయిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా పట్టణంలోని 6వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఐదేళ్లలో జగన్ పాలనలో పట్టణ ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లకు అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేలివెన్నులో భాస్కరరామయ్య..

ఉండ్రాజవరం: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. మండలంలో వేలివెన్ను గ్రామంలో బుధవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిడదవోలు ఎమ్మెల్యేగా శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయకండి

చాగల్లు: ఈ వేసవిలో మండలంలో నీటి ఎద్దడి తలెత్త కుండా కార్యదర్శులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎంపీడీవో ఎన్.బుజ్జి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారితో చర్చించారు. తాగునీటి సరఫరా, నీటి వాడకంలో పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె కార్యదర్శులకు సూచించారు. అలాగే పోలింగ్ ఏర్పాట్లపైన చర్చించారు.

పంచాయతీరాజ్ దినోత్సవం

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఎన్.బుజ్జి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై చాగల్లులో అవగాహన

చాగల్లు: వయోజనులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, కొవ్వూరు నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి ఎం.సావిత్రి, ఎంపీడీవో ఎన్.బుజ్జి అన్నారు. చాగల్లులో బుధవారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. నోడల్ అధికారులైన వారిద్దరూ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు వారు ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, టీపీ భాస్కర్, వీఆర్వో, బీఎల్వోలు, ఓటర్లు పాల్గొన్నారు.